# కృష్ణవేణి దసరా ప్రసాదం

శ్రీమతి సమయమంత్రి రాజ్యలక్ష్మమ్మగారు

కృష్ణాతీరమున కొండవీటిసీమలో కృష్ణాపురమను అగ్రహారముగలదు. పూర్వము రెడ్డిప్రభువులెవరో జగత్పండితుఁడగు నొకబ్రాహ్మణున కదిదానమొసంగియుండిరి. అయ్యది సుక్షేత్రమగుటచే ముద్దినుసుముక్కారుపంటలు పండుచుండును. కాన వలయుపదార్థములు వారింట నవ్వారిగాఁగ వారుతరుచుయజ్ఞాదిక్రతువులు చేయుటయేగాక, నిరతాన్నప్రదాతలు గూడ నగుటచే వారి కన్నదానమువారను పౌరుషనామ మలవడెను. పుట్టుపేరులో, పెట్టుపేరులోగాని దీక్షితులు, సోమయాజిపదములు వారింట నామధేయములకు మకుటములుగా తగిలింపబడుచుండెడివి.

ఒకప్పుడు తద్వంశీయులగు యజ్ఞేశ్వరసోమయాజులుగారును, వారిభార్య సోదెమ్మయును గలరు. వారును నిరతాన్నప్రదాతలై యుండిరి. సుబ్రహ్మణ్యదీక్షితులువారి కేకపుత్రుఁడు. ఇరువదిసంవత్సరములవాఁడు. పాండిత్యమందసమానప్రజ్ఞగలవాఁడు. అతనిభార్య కృష్ణవేణి. కృష్ణవేణి పుట్టింటివారిది పండితవంశమగుటచే వారింట నిత్యమును పెక్కండ్రు శిష్యులు పాఠములువల్లించి చదువుచుండుటగలదు. అట్టిగృహమున పెరిగినదగుటచే నక్షరజ్ఞానములేకున్నను కృష్ణవేణికి శ్రుతపాండిత్యము చక్కఁగా కుదిరినది. వేదశాస్త్రపురాణములందలి కథలు చక్కఁగా నెరిగినది. ఎరుకయందెంత వన్నెకెక్కినదో సౌందర్యమునఁగూడ నంత మిన్నయనిపించుకున్నది.

అప్పటికప్పుడే మనదేశ మాంగ్లేయుల పాలనములోనికి వచ్చియున్నది. తత్పూర్వము స్వదేశప్రభువులచే దత్తములై యుండిన దేవాదాయ, ధర్మాదాయ, శ్రోత్రియములైన యీనాములను, అగ్రహారములను ఎవరిఅనుభవమునందున్నవి వారికే నిలబెట్టుటకు యీనాంకమీషనరుదొరవారు ఆంధ్రదేశమునందంతటను తనిఖీకి బయలుదేరిరి. కృష్ణాపురము పూర్వమందెప్పుడో దత్తమైయుండుటచే ఆఅగ్రహారీకులవద్ద ప్రస్తుతమెట్టి నిదర్శనమును లేకుండెను. కాని దయాళుఁడగు కమీషనరుదొరవారు మూఁడుమాసములు గడువిచ్చిచనిరి.

గడవుదినములు చనుచుండుటయేగాని నిదర్శనము దొరకుననను ఆశలేదు. వంశపరంపరాగతమైన అగ్రహారము తనతరమునందంతరింపనై యున్నదని సోమయాజులుగారు బెంగచేకృశించి తుదకు మంచముపట్టిరి. నేఁడు అగ్రహారమూడిపోవుటకు సిద్ధపడుటయు, అంతకు కొలఁది దినములక్రితమే కోడలు తొలిసారి కాపురమునకు వచ్చుటయు కనిపెట్టి ఈదుస్థితి యంతయు కోడలిదౌర్భాగ్యమేయని స్థిరపరచి, పాపమాచిన్నపిల్లను నిందించుచు సోదెమ్మగారు తననామము సార్థకపరచుచుండెను. యజ్ఞేశ్వరులుగారును క్రమముగా నీమెమతము లోనికే వచ్చిరి. బాలుఁడగు సుబ్రహ్మణ్యమునకును తలిదండ్రుల యభిప్రాయమేనచ్చినది.

ఇక కృష్ణవేణి నాయింట నాదరించువారెవరు? ఎప్పుడును దూషణయే. గజ్జలతల్లి, పెద్దక్కయ్య ఇత్యాదిబిరుదముల నామెకు తగిలింపసాగిరి. నిద్రాహారములులేక అగ్ర

హారము పోయినదన్న చింతకంటె తనకీయపనిందవచ్చినదన్న దుఃఖము మెండై ఆచిన్నది నానాటికీ కృశింపజొచ్చెను. తుద కామెను పుట్టినింటికిఁబంపి వేఱొకకన్యను తమకొమరునకు చేయవలెనని సోదెమ్మ స్థిరపరచినది. ముసలాయనయు కొంతవరకుసిద్ధపడెను. కుమారుఁడును ప్రతికూలసూచనలు చేయలేదు. కృష్ణవేణి పుట్టింటనుండి బండికూడ వచ్చినది. కాని వ్యక్తిరాలగు నాచిన్నది అత్తిల్లు విడువలేదు. ఇరుగు పొరుగు వారలీయింటివారి దుర్మార్గమునకు నిందింపుచు కృష్ణవేణి నూరార్చుచుండిరి.

దేవీనవరాత్రములు వచ్చినవి. అన్నదానము వారింట నన్నపూర్ణకు నిత్యారాధన గలదు. దేవీనవరాత్రులలో వీరింట పాడ్యమిమొదలు దశమివరకు దేవీపూజ మహావైభవముతో నేటేటను జరుగుచుండెడిది. ఈయేఁడుమాత్ర మది యెవరును తలపెట్టలేదు.

నాఁడువిజయదశమి. ఆశుద్ధద్వాదశితో సర్కారువారిచ్చిన గడువు కడచనున్నది. తమకు వచ్చిన దుస్థితికివారు దిక్కులివిచారింపదొడగిరి. ఎవరెన్నితిట్టినను ఓర్చుకుని నోరెత్తకుండిన కృష్ణవేణి మతమందరకు దురవగాహముగానుండెను. సాయంత్రము పెరటి గుమ్మముదాటి కృష్ణవేణి సమీపములోనున్న జమ్మిచెట్టునకు మూఁడుప్రదక్షిణములు చేసి నమస్కరించి తనయీప్సితమును నెరవేర్పుమని ప్రార్థించి జమ్మిదళములను కన్నులకద్దుకొని అలంకృతముగాని శిరోజములందు నాజమ్మిదళముల నమర్చికొని యింటికివచ్చి దేవుని గదిలో అన్నపూర్ణకు సాగిలపడి "తల్లీ! నావలన ఈకుటుంబమునకు ఈనష్టము సంభవించిన దన్న అపఖ్యాతి నేమోయలేను. అమ్మా! జగజ్జననీ! ఈరాత్రి ఈఅగ్రహారమునకు కావలసిన నిదర్శనమెద్దియేని నీవుజూపింపవేని ఉదయముగాకమునుపే నేను ప్రాణముల తెగింతు"నని భక్తిపూర్వకముగా పలికి లేచివెళ్లినది. ఆరాత్రి ఎవరును భోజనములనుచేయక పరుండిరి. రాత్రి 12 గంటలకు కృష్ణవేణిలేచి తనభర్తనులేపి తనకువచ్చిన స్వప్నగాథ వినుపింప నారంభించెను. అతఁ డుపేక్షాపరుఁడై ఆమెను నిందించిపంపెను. ఆచిన్నది అత్తగారి దరికేగి ఆమెనులేపి తనకు స్వప్నములో నొకముసలిముత్తయిదువవచ్చి దేవతాపీఠముక్రింద బారెడు లోతులో నొకరాగిపట్టాగలదనియును, త్రవ్విచూచుకొమ్మనియును తనకు చెప్పినట్లు అత్తగారితో సాహసించిచెప్పెను. కాని సోదెమ్మ వినుగుకొని కోడలిని దుర్భాషలాడి అవల కంపెను. కాని మేల్కొనియుండిన యజ్ఞేశ్వరులుగారు మాత్రము నిదానించి ఆస్వప్నమందలి స్త్రీ అన్నపూర్ణయనియును, తానదిపరీక్షించి చూచెదననియును, తనకిది తుదియాసయనియుచెప్పి చేగునపముతో దేవతాపీఠముక్రింద త్రవ్వనారంభించెను. ఆయనభార్యయు, పుత్రుఁడునుగూడ నాయనకు సాయమొనర్చుచుండిరి.

కృష్ణవేణి అమ్మవారికెదురుగ సాష్టాంగపడి నమస్కరించి మనస్సులో ప్రార్థనము చేయుచుండెను. వారాశపీడక ఓపికకొలదిత్రవ్వుచుండిరి. తుదకు గునపమునకు కంగునదెద్దియో తగిలినది. వారి యాశలును చెంగలించినవి. రెట్టించిన ఉత్సాహముతో 774 రింకను

త్రవ్వి యొకరాగిపాత్రను పైకిదీసి పైమూతను దొలగించి అందుండి ఒకరేకుచుట్టను పైకిలాగిరి. అదిత్రుప్పుపట్టియుండలేదు. ఆచుట్టను బలవంతముగా విప్పిచూచిరి. అందు తెలిసీయు తెలియని ఆంధ్రాక్షరములు గోచరించినవి. ప్రాణములు లేచివచ్చిన సోమయాజులుగారు దేవికి నమస్కరించి కోడలిని లేవదీసి "బిడ్డా! నీవలన నాకీ అగ్రహారము నిల్చినది. నిన్ను నేను నిందించితిని." అని యేమేమో చెప్పుచు ఆనందబాష్పముల రాల్చుచుండెను. అదివరకే యానందపూరితురాలైన సోదెమ్మ కోడలిని కౌగలించికొని "అమ్మా! నీవు సామహాలక్ష్మివి, నాయింటికివచ్చిన మహాలక్ష్మి ననేకవిధముల నిందించుకుంటి" అని ప్రసంగములతో కోడలినాదరించుచుండెను. సోకర్లవలన యీవార్త విన్నవారై యిరుగుపొరుగువారు లేచివచ్చి, వీరిదృష్టమును కొనియాడుచు కృష్ణవేణి భక్తి కభినందించుచుండిరి. సోదమ్మ పెట్టితీసి ఒక అర్ధచంద్రహారమును బైటికిదెచ్చి, తన కోడలిమెడలోవేసి "అమ్మా! పూర్వ మొకమహారాజగారు ఈహారము నీయింటివారి కిచ్చియుండిరట. నాటనుండియు ఈయింటి యజమానురాలు ధరించు టాచారమైయున్నది. ఇది నా అత్తగారు నాకిచ్చినది. నేడే నీకిచ్చుచున్నాను. నేటినుండియు ఈయింటికి నీవేయజమానురాలవు. సర్వము నిపుడే నీయధీనము చేయుచున్నాను" అని అందరిలో చెప్పెను. పాపము యజ్ఞేశ్వరులుగారు కన్నీరుగార్చుచు తామాకోడలిని చేసిననిందకును, ఆమెను పెట్టిన ఉసురునకును ప్రాయశ్చిత్తముగా సకుటుంబముగా కాశీయాత్రకు పోదమనిరి.

మరునా డాజేకును తీసికొనిపోయి దొరగారికి దాఖలుచేసిరి. అగ్రహారమునిల్చినది. పట్టాపుట్టినది. సౌభాగ్యవతియగు కృష్ణవేణి అత్తమామలనుపూజించుచు, పతివ్రతయై, అన్నదానప్రదాత్రియై, సంతానవతియై సుఖముగా కాపురము చేయుచుండెను. పోయినదనుకున్న అగ్రహారము ఆదసరాలో తిరిగివచ్చుటచే నెల్లరు "నిది కృష్ణవేణికి దసరాప్రసాదము" అని చెప్పుకొనసాగిరి.

## ప్రేమ

శ్రీమతి పోతాప్రగడ రాజ్యరత్నమ్మగారు

రాజయి నేనుబుట్ట సతిరో! నీవు భిక్షుణివై జనించినన్
రాజులచిహ్నమై తనరు రమ్యకిరీటము మూలద్రోచి వే
రాజుల మన్ననల్గనుచు రంజిలు నాశిరమంత వంచి నీ
రాజితపాదపీఠి దగభృత్యునికై వడి నుంతునెంతయున్.

రాణివిగాజనింప సతి! భృత్యునిగా నిల నేజనించినన్
రాణువమీర నీహృదయరాజ్యమునందలివంకదీర్పగాఁ
బ్రాణములిట్టిబాసి మహిమొన్నతినొప్పెడు పాదరాజిపైఁ
బ్రాణములేనిబొందెనిడ భేషజమెంతయుగాదు నైజమే.